కథ

# నిర్ణయం

**ఇరవై సంవత్సరాలుగా నేను అమ్మ దగ్గర పెరిగాను. కేవలం అమ్మ దగ్గర మాత్రమే పెరిగాను. అమ్మ చేతి గోరుముద్దలు తిని, అమ్మ గుండెలపై ఆడుకుని, అమ్మ ఒడిలో పడుకుని నా జీవితంలో ప్రతి క్షణం అమ్మ సమక్షంలోనే గడుపుతూ, ప్రతి ఆనందాన్ని అమ్మతోనే పంచుకుంటూ, అమ్మే సర్వస్వంగా బ్రతికాను.**

నాన్న లేకున్నా ఆ లోటు తెలీకుండా అపురూపంగా పెంచింది అమ్మ. ఇన్నేళ్ళ నా జీవితంలో అమ్మ నన్ను బాధ పెట్టిన సందర్భాలుగానీ, నేను కన్నీళ్ళు పెట్టిన సందర్భాలుగానీ లేవు. అంత ప్రేమగా చూసుకునేది అమ్మ. నన్ను చూడగానే అమ్మ కళ్ళలో కోటిదీపాల వెలుగు నిండేది.

అందుకే, నాకు అమ్మంటే అనలేని గౌరవం. అమ్మంటే నాకు హిమాలయ పర్వతం. అమ్మంటే నాకు అమృత హస్తం.

కానీ, అది ఒకప్పటి మాట. ఇపుడు నాకు అమ్మను చూస్తేనే అసహ్యం కలుగుతోంది. ఎదురు పడాలన్నా, చూడాలన్నా, మాట్లాడాలన్నా కంపరంగా అనిపిస్తోంది.

ఇందుకు కారణం కూడా లేకపోలేదు. అదేమిటంటే 'అమ్మ ఈ వయసులో పెళ్ళి చేసుకుంటాననడం.'

అమ్మ ఈ మాట నాతో అనగానే మొదట షాక్ అయ్యాను. తరువాత జోక్ చేస్తుందేమో అనుకున్నాను.

కానీ అది జోక్ కాదని, వరుడు కూడా సిద్ధంగా ఉన్నాడని అతను అమ్మ పని చేసే ఆఫీసుకి ఈమధ్యే ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడని, ఇంటి బాధ్యతల కారణంగా, ఇంతకాలం బ్రహ్మచారిగా ఉండిపోయాడని తెలిసేసరికి నా తల తిరిగిపోయింది.

ఇరవై ఏళ్ళ కూతురిని కళ్ళెదుట ఉంచుకుని తగుదునమ్మా అనుకుంటూ ఈ వయసులో ఆమె పెళ్ళికూతురు కావడమేమిటి? లోకం ఏమనుకుంటుంది. కొలీగ్స్ ముందు, స్నేహితుల ముందు నేను తల ఎత్తుకుని ఎలా తిరగాలి? ముఖ్యంగా 'మధు' ఏమనుకుంటాడు.

''అనూ పాలు'' అమ్మ పాల గ్లాసు నా ముందు పెట్టింది.

''అక్కర్లేదు'' అన్నాను విసురుగా.

అమ్మ కదల్లేదు అక్కడి నుండి.

''వద్దని చెప్పానా'' కోపంగా అమ్మకేసి చూస్తూ అన్నాను.

అమ్మ మనసు గాయపడిందేమో ''నీకిష్టం లేకపోతే మానేసుకోనన్నానుగా. ఇంకా కోపం ఎందుకు'' ఎటో చూస్తూ చిన్నగా అంది.

''నన్నడిగి నిర్ణయం తీసుకున్నావా. వద్దంటే మానేయడానికి'' అంటూ విసురుగా లేచి నా రూమ్‌లోకి వెళ్ళి గడియ పెట్టుకున్నాను.

అమ్మ పిలుస్తూనే వుంది. అయినా నేను విననట్టే వుండిపోయాను. కాసేపటి తరువాత అమ్మ పిలవడం మానేసింది.

నాకు ఈ సమస్యను ఎలా ఫేస్ చేయాలో తెలీక తల పట్టుకు కూర్చున్నాను.

★ ★ ★

''అనూ'' పిలిచాడు మధు.

తలెత్తి మధు కళ్ళలోకి ప్రశ్నార్థకంగా చూశాను.

''మీ అమ్మ నిర్ణయం విన్నావా?'' అడిగాడు.

అదిరిపడ్డాను నేను ఆ మాటకి. సిగ్గుతో అవమానంతో నా తల నేలకి వాలిపోయింది. తలెత్తి మధు కళ్ళలోకి చూడాలన్నా నాకు ఏదోలా అనిపిస్తోంది. మధుకి తెలిసిందంటే అందరికీ తెలిసే వుంటుంది. రేపటి నుండి ఎలా తలెత్తుకుని తిరగడం.

''మాట్లాడవేం అనూ'' రెట్టించాడు మధు.

''నీకెలా తెలుసు'' ఎలాగో అడిగాను.

''ఉదయం నీ కోసమని మీ ఇంటికి వచ్చాను. కానీ నువ్వు మీ అమ్మ ఎంత పిలిచినా రూమ్ తలుపు తీయలేదుగా. అపుడే విషయం చెప్పింది. నీకెందుకు ఆమె నిర్ణయం నచ్చలేదు'' అన్నాడు మధు.

''ఎందుకు నచ్చుతుంది. ఎలా నచ్చుతుంది'' రోషంగా అన్నాను.

మధు సాలోచనగా చూశాడు నా వైపు.

''రేపోమాపో పెళ్ళి చేయాల్సిన కూతురిని ఎదురుగా పెట్టుకుని తగుదునమ్మా అంటూ పెళ్ళికి తయారయింది కాక కాబోయే అల్లుడికే ఆ విషయం చెప్పిందంటే, ఆమెను నేను ఏమనుకోవాలి. రేపు సమాజంలో ఎలా తలెత్తుకు తిరగాలి. నో. నాకిష్టం లేదు. ఐ హేట్ హర్'' ఆవేశంగా అన్నాను.

''నీలో ఇంత స్వార్థం ఉందనుకోలేదు అనూ. మీ అమ్మ మళ్ళీ పెళ్ళి చేసుకుంటే నీకు వచ్చే నష్టమేంటి'' అన్నాడు మధు.

''వ్వాట్, ఏంటి మధూ నువ్వనేది'' ఆశ్చర్యంగా, అరిచినట్టుగా అన్నాను. ఎందుకంటే మధు నుంచి ఆ ప్రశ్న నేను ఊహించనిది.

దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచి అడిగాడు మధు.

''ఒక విషయం చెప్పు. మీ నాన్న యాక్సిడెంట్‌లో చనిపోయినపుడు నీకు ఎన్ని సంవత్సరాల వయసు వుంటుంది?''

''అప్పటికి నేను ఇంకా పుట్టలేదు. నాన్న చనిపోయేటప్పటికి అమ్మ నాలుగు నెలల గర్భవతి''

''మరి అప్పుడే మీ మమ్మీ అబార్షన్ చేయించుకుని, మళ్ళీ పెళ్ళి చేసుకుంటే ఎలా వుండేది'' అడిగాడు మధు.

చివ్వున తలెత్తాను ఆ మాటకి. నవ్వాడు మధు నన్ను చూసి.

''నీ దగ్గర సమాధానం లేదు కదూ. సరే ఈ విషయం చెప్పు. మీ అమ్మ మీ మామయ్యలని, బాబాయ్‌లనీ, మిగతా బంధువులందరినీ ఎందుకు దూరంగా వుంచింది''

''వాళ్ళు స్వార్థపరులు. మా మీద అభిమానం కంటే, మా ఆస్తి మీద వారికి ఆశ ఎక్కువ'' చెప్పాను.

''మరి రాబందుల్లాంటి బంధువుల నుండి నిన్ను, ఆస్తిని రక్షించుకుంటూ, సమాజంలో ఒంటరి స్త్రీ అనే ముద్ర వేయించుకుని, ఇరవై ఏళ్ళుగా సమస్యలను ఒంటరిగా ఎదుర్కుంటూ, ఇన్నాళ్ళూ మీ అమ్మ జీవితంతో ఎందుకు సంఘర్షించిందంటావు''

దానికి నా దగ్గర సమాధానం లేదు. నేను అసలు ఆ కోణం నుండి ఎపుడూ ఆలోచించలేదు. నాకు తెలిసిందల్లా, అమ్మ, అమ్మ ప్రేమ మాత్రమే.

భావరహితంగా చూశాను మధువైపు.

''చూడు అనూ, మీ అమ్మ స్వార్థపరురాలే అయితే, నిన్ను ఈ భూమి మీదికి రాకుండా చేసి మరో పెళ్ళి చేసుకునేది. లేదా నువ్వు పుట్టగానే, నిన్ను మీ నాన్నమ్మ చేతిలో పెట్టి తన దారి తను చూసుకునేది. కాని, మీ అమ్మ అలా చేయలేదు. ఎందుకు? కేవలం నీకోసం. భర్త చనిపోయినా ప్రేమకు ప్రతి రూపమయిన నీలో తన భర్త రూపాన్ని చూసుకుంటూ, నీకు ఏ లోటు రాకుండా పెంచింది. అలాంటి ఆమెను ఎన్నేసి

మాటలన్నావు అనూ''

మధు మాటలు నా మనసును కప్పుకున్న అవివేకపు తెరలను నెమ్మది నెమ్మదిగా తొలగించి వాస్తవంలోకి తీసుకొస్తున్నాయి. మధు అడిగే ఒక్కొక్క ప్రశ్నకు నా దగ్గర మౌనం తప్ప మరే సమాధానం లేదు.

ఓ క్షణం ఆగి చెప్పసాగాడు మధు.

''ఒక ఆడపిల్లకి కన్నతల్లి ప్రేమ ఎంత అవసరమో తెలిసి, దానిని తీర్చాలని ఆరాటపడింది. ఏనాడూ నిన్ను కంట తడిపెట్టనీయకుండా పెంచింది. నిన్ను పెంచి, చదివించి, నీ కాళ్ళమీద నువ్వు నిలబడే స్థాయికి తీసుకొచ్చి, నీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దింది. ఇదంతా ఎందుకు చేసింది తన స్వార్థం కోసమా?

'నేను ఒకతన్ని ప్రేమించాను మమ్మీ' అంటే, ఏ ఆంక్షలు పెట్టకుండ పెద్ద మనసుతో అంగీకరించింది. ఎందుకు? తన సుఖం కోసమా?

ఆల్‌రైట్ నువ్వు నన్ను పెళ్ళి చేసుకుని నా దగ్గరికి వచ్చేస్తావు. ఆ తర్వాత సంసారం, పిల్లలు వారి భవిష్యత్తు కోసం డబ్బు సంపాదనలో ఇద్దరం కాలంతో పరుగులు పెడుతుంటాము. మరి మీ అమ్మ మాటేమిటి? తన యవ్వనాన్నంతా ఒంటరితనంతోనే గడిపింది. ఈ వయసులో కూడా ఏ తోడు లేకుండా మోడులా బ్రతకమని శాసించడం ఎంత వరకు న్యాయం.

చూడు అనూ, మనసు స్పందించడం అనేది మన చేతులలో లేదు. అది ఎపుడో ఒకపుడు, ఎవరినో ఒకరిని చూసి దానంతట అదే స్పందిస్తుంది. మీ అమ్మ విషయంలోనూ జరిగిందదే. నీ లాలనా పాలనలో నీ బాధ్యతలో ఆమె తనకు తాను ఆపాదించుకున్న యాంత్రికతను, జడత్వాన్ని పటాపంచలు చేసి ఆమె మనసుకు అంత దగ్గరయ్యాడంటే అతను ఎంత 'ఉత్తముడో' అతన్ని మీ అమ్మ ఎంతగా ప్రేమిస్తోందో నన్ను ప్రేమించిన నీకు అర్థం కాదా. ఈ వయసులో ప్రేమేమిటి అని నువ్వనవచ్చు. సరే ప్రేమ కాకపోతే అనురాగం అనుకుందాము'' అని ఓ క్షణం నా వేపు చూసి ఆగాడు.

తల దించుకుని ఉన్న నా కళ్ళు సజలమయ్యాయి. ఈ విధంగా నేను ఎప్పుడూ ఆలోచించలేదు. నేను ఎపుడూ నా సంతోషమే చూసుకున్నాను. ఫ్రెండ్స్, సరదాలు, సంతోషాలు, పిక్నిక్‌లు, పార్లర్స్. ఇంతే, ఇవే నా ప్రపంచం అనుకున్నాను. కానీ అమ్మ ఒంటరితనాన్ని ఏమాత్రం అర్థం చేసుకోలేదు.




మధు తిరిగి అన్నాడు ''కాలం చాలా మారిపోయింది అనూ. ఒక్కసారి పరిశీలనా దృష్టితో ఈ ప్రపంచాన్ని చూడు. నీకే అర్థం అవుతుంది. మీ అమ్మ నిర్ణయం తప్పుకాదని. ఇందులో నువ్వు అంతగా వ్యతిరేకించాల్సిన అవసరం ఏమిటో నాకు అర్థం కావడం లేదు'' అంటూ చుబుకం పట్టుకుని నా తల పైకెత్తాడు లాలనగా.

దుఃఖంతో నా కళ్ళు వర్షిస్తున్నాయి.

''ఏయ్ ఏంటిది. చిన్న పిల్లలా'' కంగారుగా అంటూ నా కన్నీళ్ళను తుడిచాడు.

నేను కన్నీళ్ళను ఆపుకోలేక అలాగే మధు భుజం మీద వాలిపోయాను.

''నేను ఇదంతా ఆలోచించలేదు మధూ. నేను ఇన్ని రోజులు అమ్మను అపార్థం చేసుకుని ఎంతో బాధపెట్టాను. క్షమించమని అడగడానికి కూడా నాకు అర్హత లేదు'' వెక్కి వెక్కి ఏడుస్తూ ముఖం చేతుల్లో దాచుకున్నాను.

మధు ఆమె తల మీద ఆప్యాయంగా నిమురుతూ-

''పిచ్చి అనూ, ఎన్ని తప్పులు చేసినా క్షమించే గుణం అమ్మకి మాత్రమే వుంటుంది. దాని గురించి నువ్వేమీ బాధపడకు. మన మంచి కోరే స్నేహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో మొదట మీ అమ్మ వివాహం జరిపిద్దాం. ఆ తరువాత వారి ఆశీర్వాదంతో మన వివాహం జరుగుతుంది. ఏమంటావు'' అన్నాడు మధు.

అతని ఉన్నతమైన వ్యక్తిత్వానికీ, మంచితనానికీ మనసులోనే పొంగిపోతూ ఆనందంగా తల వూపింది అనూష.

**పెరుమాండ్ల శ్రీదేవి**